క్లుప్తంగా

వాసవీక్లబ్ సేవలు



వాటర్ ట్యాంక్ అందజేస్తున్న సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో శనివారం వాసవీక్లబ్, చిత్తూరు గ్రేటర్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చిరు వ్యాపారులకు గొడుగులు అందజేశారు. స్కూల్ పిల్లలకు నోటుపుస్తకాలు, విద్యా సామగ్రి అందజేశారు. వరదప్పనాయుడు స్కూల్‌కి నీటి ట్యాంకును వితరణ చేశారు. కార్యక్రమంలో సభ్యులు శబరీష్ గుప్తా, వాణి, రమేష్, నాగేంద్ర, రామమూర్తి, కూన ప్రభాకర్ శెట్టి, చంద్ర పాల్గొన్నారు.

నేడు వినాయకస్వామికి అభిషేకాలు

కాణిపాకం: శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం పలు సేవలు, అభిషేకాలు జరగనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉదయం 4.30 నుంచి 5 గంటల వరకు సుప్రభాతసేవ ఉంటుందన్నారు. అలాగే 6 నుంచి 6.30 గంటల వరకు గణపతి సహస్రనామార్చన, ఉదయం 5 గంటలకు, 9 గంటలకు, 11 గంటలకు ప్రత్యేక అభిషేకం, ఉదయం 7.30, సాయంత్రం 5.30 గంటలకు పాలాభిషేకం ఉంటుందన్నారు. ఈ సమయంలో ఉచిత సేవలు ఉండవని వారు పేర్కొన్నారు.

తమిళ నటుడు విజయ్ జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న అభిమానులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): ప్రముఖ తమిళ హీరో ఇళయ దళపతి విజయ్ పుట్టినరోజు వేడుకను శనివారం విజయ్ అభిమానుల సంఘం నాయకులు చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. తోటపాళ్యంలో భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం 1000 మందికి టిఫిన్ క్యారీలు, నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు వెంకట్, శరవణ, సురేష్, లక్ష్మణ్, కంద, లోగు, ఆజార్, మనోహర్, గణేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్యాంప్రసాద్ వర్ధంతి

చిత్తూరు కార్పొరేషన్: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు గాంధీవిగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి నివాళి అర్పించనున్నట్లు నగర బీజేపీ సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, పార్టీ శ్రేణులు కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

రాజనాల బండలో ప్రత్యేక పూజలు



చౌడేపల్లి: సత్యప్రమాణాలకు నిలయమైన రాజనాల బండలోని శ్రీప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి అభిషేకాలును అర్చకులు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు స్వామివారికి పూజలు చేసి పాదముద్రికలపై నిలబడి ప్రమాణాలు చేశారు. భక్తుల రద్దీతో రాజనాలబండ ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఆలయ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు డీఎస్సీపై ఉచిత డెమో

పలమనేరు: పట్టణంలోని మదనపల్లి రోడ్డులో వాసవి హాస్టల్ మిద్దెపై కుట్టి డీఎస్సీ కోచింగ్ సెంటర్ నిర్వాహకులచే నేడు ఉచిత డెమో ఉంటుందని ఆ సంస్థ నిర్వాహకురాలు పవన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాబోయే డీఎస్సీలో ఉద్యోగం సాధించాలంటే ఎలాంటి ప్రణాళికతో చదవాలి, ఏ మెటీరియల్‌ను ఫాలో కావాలనే అంశాలపై సీనియర్ అధ్యాపకులు సలహాలిస్తారని అందులో పేర్కొన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అందులో కోరారు.

నీటి నాణ్యతపై పరీక్షలు



నీటి నాణ్యతను పరీక్షిస్తున్న కమిషనర్

పలమనేరు: జిల్లాలో వ్యాపిస్తున్న సీజనల్ వ్యాధుల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్థానిక మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సిబ్బందితో కలిసి పట్టణంలోని నీళ్ల ట్యాంకులు, సంపులను శనివారం నీటి నాణ్యతపై పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎద్దులవంక, నాగమంగళం, వైఎస్సార్ సంపుల వద్ద క్లోరోఫామ్ ద్వారా హెచ్2హెచ్ పరీక్షలను నిర్వహించారు. వర్షాకాలం కావడంతో నీటి ద్వారా పలు రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న కారణంగా ప్రజలు నీటిని కాచి వడబోచి తాగాలని సూచించారు.

కార్పొరేషన్‌లో కుర్చీలాట!

- ఆదాయం ఉన్న పోస్టులకు భలే డిమాండ్
- విభాగాలు మారిస్తే.. ఒప్పుకోని ఉద్యోగులు
- ఎమ్మెల్యేను కాదని, మంత్రి నుంచి సిఫార్సులు
- 'పరిపాలన' పేరిట ఇప్పటికే రెండుమార్లు బదిలీలు



చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రస్తుతం కుర్చీలాట ప్రారంభమైంది. ఇది కేవలం కార్యాలయంలో పనిచేసే అధికారుల మధ్య జరుగుతున్న అంతర్గత బదిలీల కుర్చీలాట. ఒకరోజు ఓ అధికారికి ఉన్న స్థానం మరుసటి రోజు ఉంటుందో.. ఉండదో..? అనే డైలమా నెలకొంది. ఇప్పటికే అంతర్గత బదిలీల పేరిట రెండుమార్లు పలువురు ఉద్యోగులను ఇతర స్థానాలకు బదిలీ చేశారు. ఇంతటితో ఈ ఆట ముగిసినట్టేనా? అంటే ఎవరికీ తెలియడంలేదు. ఎప్పుడు మళ్లీ ఎలాంటి ఉత్తర్వులు వస్తాయోననే ఆందోళన నెలకొంది.

సీటు వదలరా..?

అంతర్గత బదిలీల విషయంలో ఉద్యోగులు ఎన్నేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్నారనే విషయాన్ని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏళ్ల తరబడి ఒకే వ్యక్తి ఓ చోట పనిచేయడం వల్ల అవినీతి ఆరోపణలతో పాటు, మిగిలిన ఉద్యోగుల్లో వ్యతిరేకత కూడా వ్యక్తమవుతోంది. తాజాగా వెలువడిన రెండు అంతర్గత బదిలీల ఉత్తర్వుల్లో పేరుకు పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా అనే పదాన్ని వాడినా, ఇందులో ఉన్న లోగుట్టు మాత్రం కొందరికే తెలుసు. ఆదాయం వచ్చే సీట్లను వదులుకోవడానికి కొందరు ఉద్యోగులు ఇష్టపడటంలేదు. దీర్ఘకాలికంగా వీటినే అంటిపెట్టుకుని సొంతలాభం చూసుకుంటున్నారు. ఇలాంటి వాళ్లను మరోచోటికి మార్చేందుకు అధికారులు కూడా సాహసం చేయడంలేదు. దీనికి రాజకీయ కారణాలు కొన్నైతే, ఆర్థికపరమైన లావాదేవీలు మరికొన్ని. ఇవి నిజాయితీగా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఇది ఏమాత్రం నచ్చడంలేదు.

అర్హత ఉందా..?

కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగులను పలు స్థానాలకు బదిలీచేస్తూ కమిషనర్ ఈ నెల 18న ఉత్తర్వులిచ్చారు. దీని ప్రకారం రెవెన్యూ అధికారిగా ఉన్న గోపాలకృష్ణ వర్మను మేనేజర్‌గా, అక్కడ పనిచేస్తున్న ఉమామహేశ్వర్ రెడ్డిని రెవెన్యూ అధికారిగా నియమించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న తనూజాను టౌన్ ప్లానింగ్ విభాగానికి, అమర్‌నాథ్ రెడ్డిని ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేయగా, దురై రాజుకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, సురేష్ కుమార్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. మళ్లీ ఈనెల 20వ తేదీన మరో ఉత్తర్వులు వెలువడ్డాయి. గోపాలకృష్ణవర్మకు మేనేజర్‌తో పాటు రెవెన్యూ అధికారి సీటును కూడా అప్పగించారు. ఉమా మహేశ్వర్‌రెడ్డిని సీ–1 క్లర్క్ స్థానానికి పరిమితం చేశారు. అమర్‌నాథ్‌రెడ్డిని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా, సురేష్‌ను పాత స్థానంలోనే కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి అమర్‌నాథ్‌రెడ్డి పోస్టు యూడీ–ఆర్ఐ. ఇతడిని మరో పోస్టుకు బదిలీచేసే అవకాశం లేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేయాలంటే ఆ కోర్సును తప్పనిసరిగా చదివి ఉండాలి. ఈ అర్హత ఉన్నా సురేష్‌కు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టు దక్కలేదు. గతంలో సహాయ గణాంక అధికారిగా ఉన్న వ్యక్తికి జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ పోస్టుతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును కట్టబెట్టారు. ఎలాంటి అర్హతలేని వ్యక్తికి ఆ రెండు సీట్లు అప్పగించడానికి రూ.3 లక్షల వరకు ఖర్చుచేసినట్టు ఆరోపణలు అప్పట్లో గుప్పుమన్నాయి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పోస్టులో గతంలో పనిచేసిన దురై రాజును, మళ్లీ ఏరికోరి ఇక్కడే నియమించారు. ఇతను తప్ప మరెవరికీ ఈ పోస్టులో పనిచేసే అర్హత లేదా? అంటే చాలా మందికి ఉంది, కానీ తాము అంత స్థాయికి తూగలేమని పలువురు ఉద్యోగులు నిట్టూరుస్తున్నారు.

అమాత్యుడి వద్దకు..

కార్పొరేషన్ కార్యాలయంలో పోస్టుల కోసం పలువురు ఉద్యోగులు నేతలను ప్రసన్నం చేసుకున్నట్లు అర్థమవుతోంది. వేతనాలు కాకుండా, ఆదాయం వచ్చే పోస్టుల కోసం పోటీ పడ్డట్లు తెలుస్తోంది. కోరుకున్న సీటు కోసం ఎమ్మెల్యే వద్దకు వెళుతుండడం మామూలే. కానీ ఈసారి ఏకంగా ఎమ్మెల్యేను కాదని ఓ అధికారి రాష్ట్ర మంత్రి నుంచి ఫోన్ చేసి మరీ తన స్థానాన్ని పదిలం చేసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కార్పొరేషన్‌లో కేవలం ఓ ఐదుగురు మాత్రమే చక్రం తిప్పుతున్నారని సాటి ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా అన్ని అర్హతలతో పాటు పనిచేసే సత్తా ఉన్నా, కొన్ని ప్రధాన సీట్లలో కూర్చోవడం అందని ద్రాక్షగా మారిందని పలువురు ఉద్యోగులే విమర్శలు గుప్పిస్తున్నారు.

ఘనంగా తిరునాళ్ల



గెరిగలను ఊరేగిస్తున్న భక్తులు

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం గ్రామంలో ఉన్న గ్రామదేవత అక్కమ్మ దేవత తిరునాళ్ల శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి, విరుపాక్షమ్మ దగ్గర పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మేళతాళాల మధ్య, బాణసంచా వేడుకలతో వైభవంగా ఉత్సవమూర్తులు అమ్మవారి గెరిగలను జోడించి ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గోళ్ల హరిప్రసాద్, సర్పంచ్ గోళ్ల హేమాద్రినాయుడు, గ్రామస్తులు సురేంద్రబాబు, అమరేంద్రబాబు, వరదరాజులు, సురేంద్రనాయుడు, శ్రీధర్, ధనంజయ, గోవర్ధన్, వినాయక, నరసింహ, మనుమంతనాయుడు, సందీప్, చరణ్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం సర్వీసులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్‌లో సీనియారిటీ ప్రకారం పెండింగ్‌లో ఉండే వ్యవసాయ సర్వీసులను ఇవ్వాలని ఇన్‌చార్జి ఈఈ మునిచంద్ర తెలిపారు. సెక్షన్ల వారీగా డబ్బులు కట్టిన రైతులకు సర్వీసు విడుదల చేయాలని డీఈలను ఆదేశించారు. వారికి అనుబంధ పరికరాలను అందించాలన్నారు. పరిశ్రమల పరంగా పెండింగ్‌లో ఉండే సర్వీసులను విడుదల చేయాలని వివరించారు.

ప్లాస్టిక్ తొలగదు.. మురుగు కదలదు



కుమార్ నగర్ కాలనీ కాలువలో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ప్రధాన కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడంలో కార్పొరేషన్ యంత్రాంగం ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలేదు. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను ఉపయోగించడంపై చిత్తూరు నగరంలో నిషేధం ఉంది. కానీ దీన్ని అమలు చేయాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. నగరంలోని రోడ్లపై ఉన్న హోటళ్ల నుంచి పెద్ద పెద్ద హోటళ్ల వరకు ప్లాస్టిక్ కవర్ల వాడకం రోజురోజుకూ విచ్చలవిడిగా జరుగుతోంది. ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి అలవాటుపడి, ఒక్కసారి వాడిన కవర్లను కాలువల్లో, రోడ్లపై పడేస్తున్నారు. వర్షాలు పడే సమయంలో ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగునీటి ప్రవాహానికి అడ్డుగా మారుతోంది. కాలువల్లో నీళ్లు ముందుకు వెళ్లకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు నీటి ప్రవాహాన్ని ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నాయి. వీటిని తీయించడంలో పారిశుధ్య కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ప్లాస్టిక్ వాడకంపై ఉన్న ఆంక్షలను అమలుపరుస్తూ, ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చేయని పనులకు తప్పుడు బిల్లులు తయారు చేయడంలో చూపే శ్రద్ధను, పర్యావరణాన్ని కాపాడుతూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో మునిసిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు దృష్టి పెడితే బాగుంటుంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన కాలువలు, కూడళ్లు, కాలనీల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ అరుణ, అధికారులను ఆదేశించారు. నగరంలోని పలమనేరు రోడ్డు, సంజయ్ గాంధీ నగర్, ఇరువారం, సాంబయ్య కండిగ, కొంగారెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో శనివారం వారు విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం చేస్తున్న మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులను మరింత పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. వర్షపు నీటితో ఎక్కడా ప్రజలు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కల్వర్టులు, కాలనీల్లో, లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వచేరకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్‌కు పలు సూచనలు చేశారు. నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, దోమల నివారణ కోసం స్ప్రేయింగ్ చేయాలన్నారు. డయేరియా, మలేరియా కేసులు రాకుండా ముందస్తు చర్యలు పక్కాగా చేయాలన్నారు. ప్రధానంగా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ వందశాతం జరగాలని, ఎక్కడ చెత్త కుప్పలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొబ్బరి చిప్పలు పూర్తిస్థాయిలో తొలగించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆరోగ్య ఆదేశించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు ఉన్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందిస్తాం



తవణంపల్లె: వృద్ధులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: పల్లెల్లో నివసిస్తున్న పేదలందరికీ మెరుగైన వైద్య సేవలందిస్తామని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ద్వారకాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 53 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అదే విధంగా గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవించాలని చెప్పారు. రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వృద్ధులు బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకొని సకాలంలో వైద్యం చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటివద్దే మెరుగైన వైద్యం



గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రక్షిత అన్నారు. మండలంలోని చామంతిపురం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యమున, శ్రీలక్ష్మి, రాధ, రూబి పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదించిన ఔషధం.. అల్ల నేరేడు

- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి దివ్య ఔషధం
- నేరేడు పండ్లు శరీరానికి చలువ



విక్రయానికి ఉంచిన అల్లనేరేడు పండ్లు

బైరాల: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి సిద్ధంగా లభించే పండ్లు, కూరగాయలు సీజన్ల వారీగా తినాల్సిందే. అయితే ప్రకృతి ప్రసాదించే పండ్లలో అల్లనేరేడు పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తుంది. ఇది శరీరంలో ఏర్పడే అనేక రుగ్మతలను దూరం చేసి శరీరానికి చలువను ఇస్తాయి. రుచిలో మేటిగా ఉండే నేరేడు పండు మాత్రమే కాకుండా చెట్టు ఆకులు, బెరడు కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లు చూసేందుకు నల్లగా నిగనిగలాడుతాయి. తింటే వగరు, తీపి, పుల్లగా ఉంటాయి. మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు, కాలానుగుణంగా వచ్చే వ్యాధులను అరికట్టడంలో ఎంతో కీలకంగా ఉంటాయి. నేరేడు పండ్లు కోయడం చాలా శ్రమతో కూడుకున్న పని. అల్ల నేరేడు కేజీ రూ.100 నుంచి రూ.150 పలుకుతోంది. అందులో నాణ్యమైన నేరేడు పండ్లను వేరు చేసి ఇంకా లాభసాటి ధరకు విక్రయిస్తారు. సంప్రదాయ ఆయుర్వేద వైద్య విధానం పరంగా అనేక ఔషధ లక్షణాలు కలిగి ఉన్న నేరేడుకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుత సీజన్‌లో రోజుకు ఒక్కటి చొప్పున నేరేడు పండు తింటే వ్యాధులు దూరమవుతాయని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో మాత్రమే అరుదుగా దొరికే అల్ల నేరేడు పండ్లకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందుకే నేరేడు పండ్లను ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని పండ్ల దుకాణాల వద్ద, బండ్లపై నేరేడు పండ్లను విక్రయిస్తున్నారు.

పోషకాలు ఎన్నో..

అల్ల నేరేడు పండ్లలో ఔషధగుణాలు మెండుగా ఉంటాయి. రుచి కూడా అద్భుతం. ఈ పండులో క్యాల్షియం, ఐరన్, పొటాషియం, విటమిన్ సి, తరచుగా తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి మూత్ర సమస్యల నియంత్రణతో పాటు మధుమేహం, అదుపులో ఉంటుంది. కిడ్నీలను శుభ్రపరుస్తాయి. మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. కాలేయాన్ని శుభ్రపరిచి పనితీరును మెరుగుపరుస్తుంది. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె, మెదడుకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. దంతాలు, చిగుళ్లు ఆరోగ్యకరంగా ఉంటాయి. చిగుళ్ల నుంచి రక్తస్రావం తగ్గుతుంది. నోట్లోని చెడు బ్యాక్టీరియా నశించి దుర్వాసన రాకుండా చేస్తుంది. కడుపులో పేరుకుపోయిన మలినాలను బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది. అల్ల నేరేడు పండ్లలో విటమిన్లు, ఖనిజ లవణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో అనేక రుగ్మతలను నివారిస్తాయి. సంపూర్ణ ఆరోగ్యానికి నేరేడు పండు భరోసా కల్పిస్తుంది.

ఆరోగ్యానికి ఎంతో మేలు

అల్ల నేరేడు పండు శరీరానికి ఎంతో మంచిది. వీటితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనిషిలోని పలు రకాల వ్యాధుల నివారణకు ఈ పండు ఎంతగానో దోహదపడుతుంది. వీటిని నానబెట్టి నీరు తీసుకుంటే అజీర్తి, అతిసార, కలరా వ్యాధులు తగ్గుతాయి. కాలానుగుణంగా వచ్చే పండ్లను తింటుండాలి. ఇందులోని ఔషధ గుణాలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ తినవచ్చు.

– ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి, బైరాల

గజేంద్రుడిపై కోదండరాముడి విహారం

- భక్తితో స్వామికి ఊంజల్ సేవ
- నేడు వైభవంగా రథోత్సవం




ఆలయంలో స్వామికి ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు, గజేంద్రుడిపై ఊరేగుతున్న శ్రీరాముడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు శ్రీ కోదండరాముల దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజేంద్రుడిపై శ్రీరాముడు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం వేదపండితులచే ఆలయంలో సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేయించారు. భక్తితో స్వామికి ధూపదీప నైవేద్యం, కైంకర్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేశారు. సాయంకాలం ఊంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజాసామగ్రి, సుగంధ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తెచ్చి సమర్పించారు. పండితులు స్వామికి అభిషేకం, పూజలు చేయించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గజేంద్రుడిపై శ్రీరాముడి వైభవం...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గజవాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, గజమాలలు, సుగంధపరిమళ పుష్పాలు, వివిధ రకాల ప్రసాదాలతో మంగళవాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు, అర్చలు చేయించి నైవేద్యం సమర్పించారు. వేదమంత్రాలు పఠనం చేసి స్వామికి పూజలు చేసిన తర్వాత భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గజేంద్రుడిపై కొలువుదీరిన శ్రీరాముడు పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు రథోత్సవం

ఆలయంలో ఆదివారం ఉదయం ఉభయదారులచే తిరుమంజనం, పాలాభిషేకం, తోమాల సేవ, మధ్యాహ్నం 11 గంటలకు ఊంజల్ సేవ, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి తెలిపారు. సాయంకాలం ఊంజల్‌సేవ, కర్పూర హారతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. రథోత్సవం సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానం ఉంటుందని వివరించారు.